క్లుప్తంగా

ఎమ్మెల్యే వసంతను మర్యాద పూర్వకంగా కలిసిన సీఐ



మైలవరం: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను సీఐ కిశోర్‌బాబు సోమవారం జి.కొండూరు మండలం గడ్డమణుగులో జరిగిన ఒక కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సీఐ కిశోర్‌బాబుకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. అంకిత భావంతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

నేడు ఆసరా వారోత్సవం

నూజివీడు: స్థానిక వైఎస్సార్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా వారోత్సవం నిర్వహించనున్నట్టు మెప్మా సీఎంఎం ఆనంద్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొని, నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తారని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన



ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో శ్మశానవాటిక అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి రూ.2 లక్షల నిధులు మంజూరైనట్లు గ్రామ సర్పంచి మామిడి కుటుంబరావు తెలిపారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న శ్మశానవాటిక పనులను పూర్తి చేయడానికి నిధులు కేటాయించిన తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డికి సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులను సర్పంచి, జెడ్పీటీసీ సోమవారం పరిశీలించారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: అక్రమంగా ఉంచిన మద్యం బాటిళ్లను ఎస్ఐ విజయలక్ష్మి స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడు గ్రామ శివారులో సందేటి కోటయ్య అనే వ్యక్తి వద్ద 15 సదరన్ బ్లూ హైలైట్ విస్కీ బాటిళ్లు ఉన్నట్లు సోమవారం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందింది. ఎస్ఐ విజయలక్ష్మి గ్రామానికి చేరుకుని అతని వద్ద అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ప్రజావేదిక

విస్సన్నపేట: మండలంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని ఏపీఓ అనూరాధ సోమవారం తెలిపారు. 2022–2023లో ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గార్లపాటి రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరంలోని ప్రజావైద్యశాల రోడ్డు, కోత మిషన్ల ఏరియా, టెలిఫోన్ ఎక్స్చేంజ్, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, మాదాస్ కాలనీ, చంద్రబాబు నగర్, అంబేడ్కర్ కాలనీ, బైపాస్ రోడ్డు, నూజివీడు రోడ్డు, నారాయణనగర్, రాజాపేట, కుమ్మరి వీధి, పాత మసీదు, కాజీపేట, దేవుని చెరువు, చిన్నగూడెం, శాంతినగర్, సూరిబాబుపేట, ప్రదేశాల్లో విద్యుత్ ఉదయం 8గంటల నుంచి ఒంటి గంట వరకు ఉండదని తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్ విన్నర్‌గా ‘చాట్రాయి’

చాట్రాయి: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో బాల్‌బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో చాట్రాయి మండలం జట్టు విన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో వాలీబాల్ మూడో స్థానం, బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ విన్నర్‌గా చాట్రాయి జట్లు నిలిచాయి. ఈ జట్లు ఫిబ్రవరి 3న జరిగే జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటాయని పీఈటీలు సతీష్, ప్రభాకర్, విజయ్ తెలిపారు.

విద్యార్థుల రక్తదానం

విస్సన్నపేట: లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట, వికాస్ ఇనిస్టిట్యూషన్స్, ఆంధ్రా లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్ ఫార్మసీ కళాశాల వద్ద రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. విద్యార్థులు స్వచ్ఛందంగా 60 యూనిట్లు రక్తం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, ఆంధ్రా హాస్పటల్ వైద్యుడు అచ్యుతబాబు, లయన్స్‌క్లబ్ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, పుల్లారావు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరా అండ

- నియోజకవర్గంలో 5,770 సంఘాలు
- రూ.53.55 కోట్లు ఆసరా లబ్ధి
- 59,574 మంది మహిళలకు ప్రయోజనం



స్వయం సహాయక సంఘాల మహిళలు

నూజివీడు: మహిళల ఆర్థిక అవసరాలకు ఆసరా అండగా నిలుస్తోంది. పొదుపు చేసుకోవడమే కాకుండా, తీసుకున్న రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగో విడత నగదును వారి ఖాతాల్లో జమచేసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తరువాత క్రమం తప్పకుండా అమలు చేస్తూ స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారు. ఎన్నికల నాటికి ఉన్న డ్వాక్రా సంఘాల అప్పును నాలుగు విడతల్లో తీరుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

5,770 సంఘాలకు రూ.53.55 కోట్లు..

డ్వాక్రా సంఘాలకు ఇప్పటికే మూడుసార్లు వైఎస్సార్ ఆసరా పథకంలో నిధులు జమచేసిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నాలుగో విడతలో 5,770 సంఘాలకు రూ.53.55 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. నియోజకవర్గంలో 59,574 మంది మహిళలకు ఈ మొత్తం జమ అవుతున్నాయి.

టీడీపీ హయాంలో ఇలా..

టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో డ్వాక్రా సంఘాలు నిర్వీర్యమయ్యాయి. అధికారంలోకి రాగానే రుణాలను మాఫీ చేస్తానని, ఎవరూ బ్యాంకులకు రుణాలు చెల్లించొద్దంటూ 2014కు ముందు చంద్రబాబు డ్వాక్రా మహిళలకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో డ్వాక్రా మహిళలందరూ తమ రుణాలు చెల్లించడం మానేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు రుణమాఫీ చేయకుండా మోసం చేశారు. డ్వాక్రా మహిళలు తమ సంఘాలను తిరిగి సక్రమ మార్గంలోకి పెట్టుకోవడానికి పెద్ద మొత్తంలో అప్పులు చెల్లించాల్సి రావడంతో వాటిని చెల్లించలేక వదిలేశారు. దీంతో సంఘాలు తిరోగమన దిశలోకి వెళ్లిపోయాయి.

ఇచ్చినమాట ప్రకారం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా మహిళలకు మాట ఇచ్చారు. ముఖ్యమంత్రి అయ్యాక వారి రుణాలను ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికి నాలుగు విడతలుగా మాఫీ చేస్తూ వచ్చారు. ఇప్పుడు సంఘాలన్నీ వృద్ధిలోకొచ్చాయి. మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి.

నాలుగో విడత రుణమాఫీ ఇలా..			
మండలం	సంఘాలు	సభ్యులు	మాఫీ మొత్తం (రూ.కోట్లలో..)
నూజివీడు	1,527	15,967	15.49
ఆగిరిపల్లి	1,237	12,734	12.56
ముసునూరు	1,225	12,605	09.81
చాట్రాయి	1,119	11,883	08.90
నూజివీడుటౌన్	0,662	06,385	06.79
మొత్తం	5,770	59,574	53.55

సంఘాల బలోపేతం



ప్రభుత్వం అందిస్తోన్న తోడ్పాటుతో స్వయం సహాయక సంఘాల మహిళలు తమ రుణాలను సక్రమంగా తిరిగి చెల్లిస్తున్నారు. దీంతో బ్యాంకర్లు రుణాలను పెద్ద ఎత్తున పెంచి మళ్లీ ఇస్తున్నారు. సంఘాలన్నీ లాభాల్లోకి వెళ్లాయి. ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో మహిళల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి.

– ఆనంద్, సీఎంఎం, నూజివీడు

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



గడ్డమణుగులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

జి.కొండూరు: నిధుల లభ్యత ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని గడ్డమణుగు గ్రామంలో నూతనంగా రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.20.80 లక్షలతో నిర్మించి వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం, స్థానిక జగనన్న కాలనీకి ఏర్పాటు చేసిన ప్రత్యేక రహదారి, చెవుటూరు గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గడ్డమణుగు గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి స్థలాన్ని వితరణగా ఇచ్చిన మాదల సాంబశివరావు, రాంబాబులను ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరితిత గతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని వివరించారు. ప్రజల వద్దకే పాలన అందించేందుకు ప్రభుత్వం నిర్మించిన ప్రతి భవనం, ప్రభుత్వ ఆస్తులను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

తిరువూరు ఆర్డీవో మాధవి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీవో మాధవి

తిరువూరు: అత్యున్నత క్రీడాకారుల్ని తయారుచేయడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తిరువూరు ఆర్డీవో మాధవి అన్నారు. తిరువూరు నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేతలకు బహుమతులను సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అందజేశారు. గ్రామ స్థాయి నుంచి క్రీడాకారుల్ని తయారుచేసే ఉద్దేశంతోనే ఆడుదాం ఆంధ్రా పోటీలు అత్యంత వ్యయప్రయాసలకోర్చి నిర్వహించారన్నారు. తిరువూరు ఎంపీపీ గద్దల భారతి, తిరువూరు, గంపలగూడెం జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, గద్దల శామ్యూల్, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పురుషుల విభాగంలో కబడ్డీలో కోకిలంపాడు, పెనుగొలను, పుట్రేల, బ్యాడ్మింటన్‌లో తిరువూరు శాంతినగర్, నరసాపురం, కంభంపాడు, వాలీబాల్‌లో వేమిరెడ్డిపల్లి, కాకర్ల, పెదకొమెర, ఖోఖోలో నెమలి, వేమిరెడ్డిపల్లి, కంభంపాడు, క్రికెట్‌లో నెమలి, రాజుపేట–1, ఏకొండూరు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. మహిళా విభాగంలో కబడ్డీలో రామచంద్రాపురం, మల్లేల, పుట్రేల, బ్యాడ్మింటన్‌లో గంపలగూడెం, పుట్రేల, చౌటపల్లి, వాలీబాల్‌లో కంభంపాడు, శాంతినగర్, వేమిరెడ్డిపల్లి, ఖోఖోలో కనుమూరు, పుట్రేల, మల్లేల, క్రికెట్‌లో శాంతినగర్, ఏకొండూరు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు గెలుచుకున్నట్లు అధికారులు ప్రకటించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ భూక్య గనియా



ముసునూరు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ



తిరువూరు సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీపీ

ఏ.కొండూరు: అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు భూక్యా గనియా పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగలక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గనియా మాట్లాడుతూ అభివృద్ధి పనుల బిల్లులు త్వరలో వస్తాయని చెప్పారు. గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో రూ.95 లక్షల ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన మీటింగ్ హాలు మంగళవారం ఎంపీ కేశినేని నాని ప్రారంభిస్తారని, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు. వైస్ ఎంపీపీలు గుంటక శివారెడ్డి, సిద్ధం పద్మ, ఎంపీడీఓ రవికాంత్, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో విజయవంతమైందని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక మాట్లాడుతూ మండలంలో 5,000 ఎకరాల్లో వరి పంట పండిందని, ధాన్యం కొనుగోలును నూరుశాతం విజయవంతం చేశామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్య ప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చేతి పంపుల ఏర్పాటు, మరమ్మతులకు అవసరమైన మెటీరియల్ మంజూరైందని, వెంటనే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, పి.గంగాధర్ మాట్లాడుతూ గృహనిర్మాణాలకు, పెండింగ్‌లో ఉన్న జగనన్న లేఅవుట్లను పునఃప్రారంభించి, అందుబాటులోకి తేవాలని కోరారు. సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల, సొసైటీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు కోరారు. జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీడీఓ జి.రాణి, డీటీ ఎమిలీకుమారి, పర్యవేక్షకుడు సాయి రాము, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,ఉపసర్పంచ్‌లు,అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి నిధుల కేటాయింపు

తిరువూరు: మండల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన గ్రామాల్లో రూ.64 లక్షలతో సీసీ రహదారులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు మండలంలో 50 మంజూరవగా, 25 భవనాల నిర్మాణం పూర్తయిందని పంచాయతీరాజ్ ఏఈ రాజేష్ తెలిపారు. ఆర్ అండ్ బీ ఏఈ లక్ష్మి మాట్లాడుతూ అడసర్లపాడు–తిరువూరు రహదారి, శ్రీరాంపురం–పేరువంచ రహదారులకు రూ.3.90 కోట్లు, పలు రహదారుల నిర్వహణకు రూ.12 లక్షలు, అక్కపాలెం–తిరువూరు రహదారికి రూ.18 లక్షలు, తిరువూరు–తునికిపాడు రోడ్డుకు రూ.24 లక్షలు, చిట్టేల–ఆంజనేయపురం రహదారికి రూ.16 లక్షలు, తిరువూరు–రాజవరం రోడ్డుకు రూ.14 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామీణ గృహనిర్మాణ పథకం కింద 6వేల గృహాలు మంజూరు కానున్నాయని, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా 109 ఇళ్లు కూడా మంజూరయ్యాయని హౌసింగ్ అధికారులు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



మూలపాడులో రైతుభరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత, తదితరులు

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలో రూ.29.30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సోమవారం రాత్రి ప్రారంభించారు. సుజనాచౌదరి ఎంపీ నిధులు రూ.25 లక్షలు, మున్సిపాల్టీ నిధులు రూ.4.30 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. మూలపాడులో రూ.25 లక్షలతో కమ్యూనిటీ భవనం, రూ.22.8 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభించారు. అభివృద్ధి అంటే ఎన్నికల ముందు శిలాఫలకాలు వేసి పబ్లిసిటీ చేసుకోవడం కాదని, నిధులు మంజూరు చేయించి వాటిని పూర్తిచేసి ప్రారంభించడం నిజమైన అభివృద్ధని అన్నారు. మున్సిపాల్టీలో సుమారు రూ.50 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. 3,600 మందికి ఇంటి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచి చింతల భూలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గొట్టిముక్కల రాధ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, గుంజా శ్రీనివాస్, నాగరాజకుమారి, మిక్కిలి శరభయ్య, లంకే అంకమోహనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంత సాంబశివరావు, పాలడుగు దుర్గాప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ట్రెజరీ అధికారి సేవలు ప్రశంసనీయం



ట్రెజరీ అధికారిని సత్కరిస్తున్న డెమొక్రటిక్ పీఆర్‌టీయూ నాయకులు

మైలవరం: స్థానిక ఖజానాధికారి సేవలు ప్రశంసనీయమని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పీ నాగరాజు పేర్కొన్నారు. మైలవరం ట్రెజరీ కార్యాలయంలో సోమవారం ట్రెజరీ అధికారి నాగ సత్యనారాయణను నేతలు ఘనంగా సత్కరించారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ ఖజానాధికారిగా ఎంపికైన సందర్భంగా నాగ సత్యనారాయణను సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన సమస్యలను ఖజానాధికారికి తెలియజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తానని తెలిపారని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పీ నాగరాజు తెలిపారు. జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ అక్బర్ భాషా, మైలవరం మండలం అధ్యక్షుడు కే కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ రామకృష్ణ, ఇబ్రహీంపట్నం మండలం ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్ భాషా, మస్తాన్‌రావు, ఎస్‌కే బాజీ, టీ ఓం ప్రకాష్, ఏ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): మండలంలోని కొటికలపూడి గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు మెరుపుదాడి చేశారు. దాడిలో 12 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు కొటికలపూడిలో పేకాట శిబిరం నడుస్తుందని సీఐ ఎం.సత్యన్నారాయణకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో పేకాట ఆడుతున్న వివిధ గ్రామాలకు చెందిన 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద లభించిన రూ.47,860 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. పేకాట సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సోలార్ విద్యుత్ వెలుగులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలు

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం విద్యుత్ వెలుగులు నింపుకుంది. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం రాత్రి వేళల్లో చీకటిలో ఉండేది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అభ్యర్థన మేరకు ప్రవాసాంధ్రులు, భవన నిర్మాణ దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి రూ.4,50,000 తన సొంత నిధులతో కొత్తగా 25 ఆటోమేటిక్ సోలార్ స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డికి కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ధన్యవాదాలు తెలియజేశారు.

కేజీబీవీకి ప్రింటర్ బహూకరణ



తోటమూల(గంపలగూడెం): గంపలగూడెం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి దాత సోమవారం రూ.20 వేల విలువ చేసే ప్రింటర్ కమ్ స్కానర్‌ను వితరణగా ఇచ్చారు. అమ్మిరెడ్డిగూడెంకు చెందిన మందపాటి నాగేంద్రమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకుడు మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, రాధా దంపతులు ప్రింటర్ కం స్కానర్‌ను ప్రత్యేక అధికారి ఎం .వెంకటలక్ష్మికి అందజేశారు. ప్రత్యేక అధికారి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకం



మైలవరం: తిరువూరు పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బి.వి జయబాబు బంగారు పతకం సాధించాడు. మాస్టర్స్ (75కిలోలు) విభాగంలో ఈ పతకం సాధించినట్లు కోచ్ వెంకట్రావు సోమవారం తెలిపారు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో 55, 61, 69, 81 విభాగాల్లో తమ క్రీడాకారులు గోల్డ్, సిల్వర్, పతకాలు సాధించారని తెలిపారు. జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మోతీలాల్, ఏసీపీ ఎం.రమేష్ ద్వారా విజేతలకు పతకాలు అందజేశారు.

మాదిగ సంఘం కార్యవర్గం ఎన్నిక

నూజివీడు: నూజివీడులో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాదిగ సంఘం నూజివీడు నియోజకవర్గ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కన్వీనర్ కేటీ ప్రభాకర్ తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ కంచర్ల లవకుమార్, ఉపాధ్యక్షులుగా కంభాల రాంబాబు, భుజంగరావు, లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా దేవరాజు, కోశాధికారిగా మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, 15 మంది కార్యవర్గ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నామని పేర్కొన్నారు. కమిటీ మాదిగల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జి.కొండూరు: మండలంలోని కుంటముక్కల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఫిబ్రవరి 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన జరుగుతుందన్నారు. అర్హత ఉన్న విద్యార్థినులు httpr://apbrafcet.apcf-rr.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అలరించిన హరికథా గానం

తిరువూరు: త్యాగరాజ గానకళాసమితి ఆధ్వర్యంలో తిరువూరులో రెండోరోజు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపిన అనంతరం నెమ్మలూరు చంద్రశేఖర్ ఆధ్యాత్మికోపన్యాసం ఇచ్చారు. త్యాగరాజ సంగీత పాఠశాల బృందం విద్యార్థులు, కొల్లిపర శ్వేతల గాత్రకచేరీ, మడమల రాంబాబు భాగవతార్ హరికథా గానం అలరించాయి. గానకళా సమితి అధ్యక్ష కార్యదర్శులు కాసులనాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, మురుకుంట్ల సీతారామలింగేశ్వరశర్మ పర్యవేక్షించారు.

చంద్రబాబు తీరుపై నిరసన

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు మద్దతు ఇవ్వడంపై మాల ఐక్యవేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో ఆదివారం రాత్రి చంద్రబాబు తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కొటికలపూడి గ్రామ సర్పంచి రెంటపల్లి నాగరాజు, మాల ఐక్యవేదిక నాయకుడు చందా చంటి మాట్లాడుతూ ఉరవకొండ సభలో చంద్రబాబు వర్గీకరణకు మద్దతు తెలపడంపై వచ్చే ఎన్నికల్లో మాలలు ఐక్యంగా టీడీపీకి బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు తీరుపై గ్రామస్థాయిలో మాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు. ఎన్నికల సమయంలో కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందాలని చూడటం చంద్రబాబు అవివేకం అన్నారు. కులాల ప్రాతిపదికన వర్గీకరణ సాధ్యం కాదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గుర్తు చేశారు. దొంతమాల నాగేశ్వరరావు, బొల్ల వెంకటేశ్వరరావు, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై స్వామి సోమవారం తెలిపారు. చాట్రాయి మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన బాణావతు భీముడు మోపెడ్‌పై 10 లీటర్ల సారా తరలిస్తుండగా పర్వతాపురం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నామని, వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామ చెప్పారు.